మినీకథ

# ఎక్స్‌రే కళ్ళు

5 గంటల నుండే ఒక్కొక్కరే రవీంద్ర భారతికి రాసాగారు 6గంటలు కాగానే రవీంద్రభారతి అంతా ప్రేక్షక మహాశయులతో నిండిపోయింది

ఆవేళ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు ప్రొఫెసర్ జలాల్ ఇంద్రజాల విద్యను చూపెడుతున్నాడు

ప్రదర్శన జోరుగా సాగుతున్నది ప్రేక్షకులు ఆనందం పట్టలేక చప్పట్లు కొడుతున్నారు కొందరు ఉత్సాహంతో ఈలలు వేస్తున్నారు ఇలా పసందుగా సాగుతున్న సమయంలో ఒక వింత ప్రదర్శనను ప్రారంభించాడు ఇంద్రజాలికుడు.

అదేమిటంటే—

ఆరోజు న్యూస్‌పేపర్ తీసి బల్లమీద పెట్టాడు దాని మీద తన దగ్గరున్న నల్లని దళసరి గుడ్డను రెండు మడతలు వేసి, ఒకసారి అది అందరికీ చూపించి న్యూస్ పేపర్‌ను ధారాళంగా చదవసాగాడు అది చూసి హాల్లో వాళ్ళందరూ విస్తుపోయారు వాళ్ళందరితో పాటు 'విజయ' కూడా విస్తుపోయింది అంతలోనే ఇంద్రజాలికుడు తన నల్లని కోటును విప్పదీసి ఆ రెండు మడతల గుడ్డపైన వేసి మళ్ళీ చక్కగా చదవసాగాడు

ఇది చూసి చికాకు పడుతూ లేచి పోబోయింది 100/-రూపాయలు టిక్కెట్టు కొన్న విజయ ప్రక్కనే కూర్చున్న ఆడవాళ్ళు "అదేమిటి ఇంత అద్భుతంగా ఉంటే లేచిపోతున్నావ్" అని ఆశ్చర్యంగా అడిగారు

విజయ చిరాకు పడింది!

"మీకేం సిగ్గూ ఎగ్గూ లేవనుకుంటాను అంత మందమైన నాలుగు పొరలున్న గుడ్డల నుండే పేపరును నిక్షేపంగా చదివేస్తున్నాడే, ఈ పల్చని నాజూకైన బట్టలను కట్టుకొని మీరంతా వాడి ఎదుట ఇంకా ఎట్లా కూర్చోగలుగుతున్నారు? ఛీ ఛీ పాడు—" అంటూ హేండ్ బాగ్‌ను చేతికి తగిలించుకొని చరచరా హాలు బయటికి నడిచింది విజయ

—రావూరి రవీంద్రనాథ్

---

ప్రాణం, జీవం, మేధ, చైతన్యం—గల మనిషివి నువ్వు!
చరిత్ర చక్రాన్నింకా హింసారక్తపాతాల మార్గంలోనే పోనిస్తావా??
కష్టాలకు కరుగక, కన్నీళ్ళకు చలించక, ఇంకా జడంగా కూర్చుంటావా?"
ఉచ్చైశ్రవంతో ప్రక్కవాని కందియ్యి పిలుపు—స్నేహంతో చెయ్యికలుపు—
స్వార్థత్వానికి చెవులు మెలెయ్యి—సంకుచిత్వాన్ని సత్వరం ఉరితియ్యి!
చరిత్ర గతిమీద, దుష్ట సంఘ వ్యవస్థమీద ప్రభంజనంలా ఎదురుతిరుగు—
పిరికి వదులు, ఉరికి కదులు, మనిషిగా మహోన్నతుడవై ఎదుగు!!
అసంఖ్యాక పీడిత ప్రజాసందోహానికి బంగారు భవిష్యత్‌ని పొదుగు!!

—బొడ్డపాటి సూర్యనారాయణమూర్తి